సాక్షి
విశాఖపట్నం
శనివారం, 10, ఫిబ్రవరి, 2024



ప్రమాద రహిత జిల్లాగా..

విశాఖను ప్రమాద రహిత జిల్లాగా మారుద్దామని కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్ పిలుపునిచ్చారు. 8లో



పార్కులతో ప్రశాంతత

పార్కులు.. ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 8లో



పీవీకి భారతరత్నపై హర్షం

దివంగత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 8లో

సీఎం జగన్ పర్యటనకు ఏర్పాట్లు

- 'ఆడుదాం-ఆంధ్రా' ముగింపు వేడుకలకు హాజరుకానున్న ముఖ్యమంత్రి
- వైఎస్సార్ క్రికెట్ స్టేడియంను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న



ఏర్పాట్లపై చర్చిస్తున్న ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న విశాఖలో పర్యటించనున్నారు. పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఆడుదాం-ఆంధ్రా రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం స్టేడియంలోకి రాక, క్రీడాకారులతో ఫొటోలు, ప్రజలతో మమేకం, అభివాదం తదితర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించారు. సీఎం వైఎస్ జగన్ 13వ తేదీ సాయంత్రం స్టేడియానికి చేరుకుని ముందుగా లోపల ఓపెన్ టాప్ వాహనంపై తిరుగుతూ ప్రజలకు అభివాదం చేస్తారని, అనంతరం కామెంటేటర్ రూంకు చేరుకుంటారని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న కలెక్టర్‌కు తెలియజేశారు. తుది ఆట ముగిసిన వెంటనే స్టేడియం లోపల లేజర్ షో ఉంటుందని, అనంతరం సీఎం క్రీడాకారులను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లను రహదారి భవనాల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మల్లికార్జున పలు సూచనలు చేశారు. విద్యుత్, పోలీసు శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, సామాన్య ప్రజానీకం వచ్చి ఆటలను ఆస్వాదించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టేడియంలోకి ఆ రోజు సుమారు 25 వేల మందికి పైగా ప్రజలు వస్తారని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 మణికంఠ, రహదారులు భవనాలు, విద్యుత్, అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా జోష్



ఉత్సాహంగా క్రీడాకారులు



పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి రోజా. చిత్రంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, హరివెంకట కుమారి, కోలా గురువులు, వరుదు కల్యాణి



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



ఏయూ మైదానంలో వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

- 'ఆడుదాం ఆంధ్రా' తుది దశ పోటీలు ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి రోజా
- క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయం : బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విశాఖ స్పోర్ట్స్:

మహా క్రీడా సంబరంతో విశాఖ మురిసిపోయింది. గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి విశాఖ వేదికైంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా.. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలను విశాఖ రైల్వే స్టేడియంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. 13న ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈసందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ చరిత్రలో మనకంటూ ఒక పేజీ ఉండాలంటే ఇదే చక్కటి సందర్భం అన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తొలుత రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వీసీఎండీ టాలెంట్ హంట్‌లో భాగంగానే ఈ పోటీలు అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ విశాఖ వేదికగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం నగరం చేసుకున్న అదృష్టమన్నారు. భారత్ క్రికెట్ జట్టు వికెట్ కీపర్, స్థానికుడు కేఎస్ భరత్ మాట్లాడుతూ కష్టపడితే ఫలితం దక్కుతుందని అన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 26 జిల్లాలకు చెందిన మెన్, వుమెన్ జట్ల చేత అతిథులు క్రీడాప్రతిజ్ఞ చేయించారు. తొలుత రైల్వే స్టేడియంలోని వేదిక వద్ద శాప్ పతాకాన్ని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జాతీయ పతాకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించగా అతిథులు గౌరవవందనం సమర్పించారు. పోటీలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి ప్రకటించి గాల్లోకి బెలూన్లను విడిచారు. అనంతరం అతిథులు క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, ఇతర రాజకీయ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మంత్రి రోజా కరచాలనం



కబడ్డీ..కబడ్డీ



కలెక్టర్ మల్లికార్జునతో సెల్ఫీ



హాజరైన జట్ల ఆటగాళ్లు



క్రీడాకారులతో భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్ భరత్

న్యూస్‌రీల్

నేడు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాక

మహారాణిపేట: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ శనివారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 11.50 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొని రాత్రికి బస చేస్తారు. 11న అనకాపల్లి వెళతారు, అక్కడ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 5.55 గంటలకు విమానంలో ఢిల్లీ వెళతారు.

11న కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి రాక

మహారాణిపేట : కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్ ఈనెల 11న విశాఖ వస్తున్నారు. న్యూఢిల్లీ నుంచి విమానంలో ఆదివారం సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 12న వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం విజయవాడ వెళతారు.

14న నీతి అయోగ్ సభ్యుడి రాక

నీతి అయోగ్ సభ్యుడు ఆచార్య రమేష్ ఈనెల 14న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో వస్తున్న ఆచార్య రమేష్ 14న సాయంత్రం విశాఖ చేరుకుంటారు. స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 15న తిరిగి ఢిల్లీ వెళతారు.

యువతకు అవకాశాల వేదిక యువశక్తి

పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు



బీచ్ రోడ్డు: యువతకు చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాల వేదిక యువశక్తి సదస్సు అని పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు అన్నారు. శుక్రవారం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో యువశక్తి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా యువత ముందున్న సవాళ్లను పరిష్కరిస్తామన్నారు. పారిశ్రామిక పురోగతి, భవిష్యత్ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి, విశాఖతో పాటు ఆంధ్రా యువతకు సాధికారత కల్పిస్తామన్నారు. రాబోయే 50 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 యువశక్తి సదస్సులు, 10 రైతు సాధికారత సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి, విశాఖ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలన్నా యువతదే కీలకపాత్ర అని చెప్పారు.

హంస వాహనంపై సింహగిరీశుడు

- దేవేరులతో వేణుగోపాలుడిగా దర్శనం
- వరాహ పుష్కరిణిలో నౌకా విహారం
- కనులపండువగా తెప్పోత్సవం



వేణుగోపాలస్వామి అలంకారంలో అప్పన్న స్వామి



నౌకలో అప్పన్న స్వామి విహారం

సింహాచలం : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేణుగోపాలస్వామిగా ఉత్సవంలో దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి అంతా కిటకిటలాడింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకి తీసుకొచ్చారు. కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు మెంబర్లు, అధికారులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామిని ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. శోభానమానీయంగా అలంకరించిన హంసాకృతి నౌకపై స్వామిని వేంజేంపచేశారు. సాయంత్రం సుమారు 6 గంటల నుంచి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వరాహ పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం చుట్టూ మూడుసార్లు హంసవాహనాన్ని ప్రదక్షిణగా తిప్పారు. అనంతరం మండపంలో స్వామిని వేంజేంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, షోడషోపచార పూజలు, విశేష ఆరాధనలు, పారాయణాలు నిర్వహించారు. తదుపరి స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి సర్వజన మనోరంజని వాహనంపై వేంజేంపజేసి గ్రామ తిరువీధిని విశేషంగా నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి అడవివరం గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, వేద పండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వంకాయల సాయినిర్మల, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రామలక్ష్మి, బయ్యవరపు రాధ, ముదుండి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. స్వామివారు విహరించిన హంసవాహనాన్ని విశేషంగా తీర్చిదిద్దారు. వరాహ పుష్కరిణి వద్ద పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని విశేషంగా అలంకరించారు. పుష్కరిణి గట్టుపై ఏర్పాటు చేసిన సాంస్కృతికార్యక్రమాలు, కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్

విశాఖ-లీగల్: వచ్చే నెల 9న జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూవ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో లేదా 0891- 2560414, 2575046 నంబర్లలో, vskpdlsa@yahoo.com, dlsa.vsp@gmail.com ల మెయిల్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

టెట్‌కు దరఖాస్తు చేసుకోండి

విశాఖ విద్య: ఆంధ్ర ప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ టెట్)కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 19న ఆన్‌లైన్ మాక్ టెస్టు ఉంటుందన్నారు. ఈ నెల 23 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 9 వరకు టెట్ పరీక్షలు ఉంటాయన్నారు. అర్హులైన, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నైపుణ్య వారధి.. సాంకేతిక సారథి

- ఘనంగా నైపుణ్యాభివృద్ధి సదస్సు
- ఇండస్ట్రీ 4.0 పేరుతో నిర్వహించిన నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024

కొమ్మాది : రాష్ట్రంలోని యువతను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య వనరుగా సంసిద్ధుల్ని చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తూ.. అత్యున్నత ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలకు దేశ, విదేశాలకు చెందిన సంస్థలు ఆకర్షితులవుతున్నాయి. ఆ సంస్థలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే.. అద్భుత ఆవిష్కరణకు విశాఖ నగరం వేదికగా నిలిచింది. ఇండస్ట్రీ 4.0 పేరుతో ఏపీఎస్ఎస్‌డీసీ శుక్రవారం నిర్వహించిన నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024 విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర ఆర్థిక, నైపుణ్య శిక్షణాభివృద్ధి శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సదస్సును ప్రారంభించారు.



మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

నైపుణ్య రంగానికి సీఎం పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో నైపుణ్యరంగానికి పెద్దపీట వేశారు. ఏపీలో అత్యుత్తమ నైపుణ్య విధానాలను అమలు చేస్తున్నాం. నియోజకవర్గానికి చొప్పున 175 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఏపీలో 194 హబ్‌ల ద్వారా యువతకి శిక్షణ అందిస్తున్నారు. 26 స్కిల్ కళాశాలలను ఏర్పాటు చేశాం. ప్రతి హబ్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమవుతోంది.

– కొండూరు అజయ్‌రెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్

నైపుణ్యరంగంలో ఏపీ దిక్సూచి

నైపుణ్య రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకూ దిక్సూచీగా నిలుస్తోంది. సేవారంగంలోని వారికి నైపుణ్యం అందిస్తే విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. విద్యార్థి దశ నుంచే 'ఫ్యూచర్ స్కిల్స్' అందించేలా ప్రభుత్వం చొరవ చూపిస్తోంది. ప్రతి స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజ్ రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే సంస్థగా మారింది.

– ఎస్.సురేష్ కుమార్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి

'సైబర్ స్పేస్'లో నైపుణ్య భాగస్వామ్యం అవసరం

వైద్య రంగంలో నైపుణ్య అంతరాల గురించిన అనుభవాలు కొన్ని క్షేత్రస్థాయిలో తెలుసుకున్నా. సైబర్ క్రైమ్, సైబర్ టెరర్రిజం, ఆన్‌లైన్ మోసాలను అధిగమించడానికి నైపుణ్యం చాలా అవసరం. 'సైబర్ స్పేస్' రంగంలో నైపుణ్య భాగస్వామ్యం ఆవశ్యకత ఎంతో ఉంది. ఎన్నో కీలక కేసుల పరిష్కారానికి కమ్యూనికేషన్ స్కిల్స్ తోడ్పడతాయి.

– డా.రవిశంకర్, నగర పోలీస్ కమిషనర్

కరికులంలో మార్పులు అత్యవసరం

రాష్ట్రంలో విద్యా వ్యవసను ప్రభుత్వం అత్యద్భుతంగా తీర్చిదిద్దింది. ముఖ్యంగా పరిశ్రమలకు, విద్యా సంస్థలకు మధ్య వారధిగా ఏపీఎస్ఎస్‌డీసీ అందిస్తున్న సేవలు అనిర్వచనీయం. పరిశ్రమలకు అనుగుణంగా యువతను సన్నద్ధం చేయాలంటే కరికులం మారాలి. యువత ఎంచుకున్న రంగాల్లో రాణించాలంటే అధ్యాపకులది కీలక పాత్ర అన్న విషయాన్ని మర్చిపోకూడదు. మూడేళ్లలో ఏపీ ప్రభుత్వం విద్యారంగానికి సంబంధించి కీలక సంస్కరణలు చేపట్టింది.

– పోలా భాస్కర్, ఏపీ కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్

విశాఖను ప్రమాదరహిత జిల్లాగా మారుద్దాం

- కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్
- ఏఎంఎన్ఎస్ సంస్థ సమకూర్చిన ట్రాఫిక్ వాహనాలు ప్రారంభం


ద్విచక్రవాహనాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

బీచ్‌రోడ్డు: విశాఖపట్నంను ప్రమాద రహిత జిల్లాగా మారుద్దామని కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్ పిలుపునిచ్చారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ(ఏఎంఎన్ఎస్) సీఎస్సార్ నిధులు రూ.57లక్షలతో 32 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలు, ఓ క్రేన్‌ను కొనుగోలు చేసింది. ఆర్.కె.బీచ్ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని కలెక్టర్, సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం రూ.30 కోట్లు వెచ్చించి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలీస్, జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలతో 2022కు కంటే 2023లో గణనీయంగా రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సివిల్, ట్రాఫిక్, జీవీఎంసీ, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్, వీఎంఆర్డీఏ అధికారులు చేపట్టిన సంయుక్త తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. రూ.150 కోట్లతో 27 కిలోమీటర్ల మేర మారికవలస, తిమ్మాపురం, ఎండాడ, బోయపాలెం రహదారి విస్తరణ పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. కేజీహెచ్, విక్టోరియా ఆస్పత్రుల్లో ఏఎంఎన్ఎస్ సంస్థ రూ.కోటితో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. రూ.60 లక్షలతో నగరంలోని పలు బాలల వసతి గృహాలను అభివృద్ధి చేస్తోందని, ఇప్పుడు రూ.57 లక్షలతో వాహనాలు అందించడం అభినందనీయమన్నారు.

అత్యాధునిక సౌకర్యాలతో వాహనాలు

అత్యాధునిక సౌకర్యాలతో ట్రాఫిక్ వాహనాలను సిద్ధం చేశారు. ఈ బైక్‌లో ప్రథమ చికిత్స బాక్స్, డిజిటల్ బోర్డు, వార్నింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. నూతన ఆలోచనలతో వీటిని రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. వీటితో పాటు రిఫ్లెక్టర్ జాకెట్లు, లాక్స్, సిగ్నల్ లైట్స్ వంటివి కూడా ఏఎంఎన్ఎస్ సంస్థ అందజేసింది. కార్యక్రమంలో నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, ఏఎంఎన్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రనాథ్, విశ్రాంత ఏఎస్పీ టి.ఎస్.ఆర్ ప్రసాద్, హెచ్.ఎం.ఎం.ఆర్.డి ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా పోటీలు
- తొలిరోజు విజేతలు వీరే..

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని పలు మైదానాల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. తొలి రోజు జరిగిన పోటీల్లో విజేతలు వీరే..

క్రికెట్: క్రికెట్ పోటీల్లో ఆరిపాక జట్టు, ములగాడ జట్టు, చేబ్రోలు 2, ఎంఆర్‌పల్లి 2 జట్లు మహిళా విభాగంలో విజయం సాధించాయి. మెన్ క్రికెట్‌లో రామకృష్ణాపురం, పెదలబుడు 2, అశోక్ పిల్లార్ రోడ్ జట్లు విజయం సాధించాయి. ఈ పోటీలు వైఎస్సార్ బి గ్రౌండ్, కేవీకే స్టేడియం కొమ్మాది, రైల్వే స్టేడియం గ్రౌండ్, ఏఎంసీ గ్రౌండ్స్‌లో జరిగాయి.

వాలీబాల్: వాలీబాల్‌లో కుచ్చువారిపల్లి 1, రాజకవీధి 1, ఆకివీడు 4, కోలతూరి 1 సెక్రటేరియట్ జట్లు మహిళా విభాగంలో విజయం సాధించగా, ఆరవల్లి, కొవ్వాడ మత్స్యలేసం, ధర్మవరం, ఈదర 1 సెక్రటేరియట్ జట్లు పురుషుల విభాగంలో విజయం సాధించాయి. మహిళల కబడ్డీలో సాలపువానిపాలెం, నౌలూరు 1, గాంధీనగర్ కాలనీ 1 జట్లు విజయం సాధించాయి. పురుషుల కబడ్డీలో నాగులాపురం 1, వడ్డమండు, చిక్కాల 1 సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. ఖోఖో మహిళా విభాగంలో దుగ్గిరాల, నెహ్రూచౌక్ సెంటర్, మెన్ విభాగంలో రుద్రవరపురం, పురుషోత్తమపురం సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. ఈ పోటీలు ఏయూ గ్రౌండ్స్‌లో జరిగాయి.


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు


బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న ఆటగాళ్లు

బ్యాడ్మింటన్ : బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖకు చెందిన ఆశ్రిత-పర్ణిత జోడి ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. మహిళలకు జరిగిన తొలి రౌండ్‌లో బి.హారిక-శ్రియాదేవి (విజయనగరం) జోడి 21-08, 21-07తో కె.జి.వి.శ్రావణి-షాలిని (తూర్పుగోదావరి) జోడిపై విజయం సాధించింది. చేతన-శ్రీన్ (కర్నూలు) 21-01, 21-02తో హేమలత-శారద (అనకాపల్లి) జోడీపై విజయం సాధించింది. ఆశ్రిత-పర్ణిత (విశాఖ) 21-12, 21-10తో నందిని-పూర్ణిమ (శ్రీసత్యసాయి) జోడీపై విజయం సాధించగా ఆకాంక్ష-ఈశా(బాపట్ల) 21-04, 21-07తో ఫిరోజ్ బేగమ్-రఫియా జోడిపై విజయం సాధించింది. హాశిత-రమ్య (ఎన్టీఆర్) 21-09, 21-11తో సత్యప్రియా-రోహిత జోడిపై విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మెన్ పోటీల్లో సుదీర్-నాగసాయి (తిరుపతి) 18-21, 21-14, 21-19తో ప్రవీణ్‌కుమార్-గురుసాయిచరణ్ జోడిపై విజయం సాధించింది. కుమార్-శేఖర్ జోడి (శ్రీసత్యసాయి), చంద్రగోపి- విజయసాయిరెడ్డి (గుంటూరు) జోడి జట్లు హోరాహోరీగా తలపడి మూడో సెట్‌లో విజయంతో ప్రీక్వార్టర్స్‌కు చేరుకున్నాయి. ఈ పోటీలు ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో జరిగాయి.

బాలికపై లైంగిక దాడికి యత్నం

- వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష

విశాఖ లీగల్: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కొమ్మాదిలో బాలికపై లైంగికదాడికి యత్నించిన కేసులో నిందితుడికి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివీ.. నిందితుడు కడవండి కామేష్(39) కొమ్మాదిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2022 మే 22న సాయంత్రం ఐదు గంటల సమయంలో అదే అపార్ట్‌మెంట్ కిందన నివసిస్తున్న చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నం చేశాడు. బాలికను తీవ్రంగా హింసించాడు. ఇది గమనించిన బాలిక తల్లి పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ రూపవతి నిందితుడిపై ఐపీసీ 354, పోక్సో చట్టం సెక్షన్9(ఎన్) కింద నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. కేసును దిశ పోలీస్‌స్టేషన్ ఏసీపీ వివేకానంద పర్యవేక్షించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

కరాటే పోటీల ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: నిజిషోటోకాన్ కరాటే పేరిట నిర్వహిస్తున్న ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం పోర్ట్ స్టేడియంలో సినీనటుడు సుమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మూడు రోజుల పాటు కాటా, కుమిటీ అంశాల్లో పోటీలు జరగనున్నాయి.

ఆకట్టుకున్న సైకత లింగం


శివలింగం వద్ద ప్రేమ్ సింగ్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ వద్ద శుక్రవారం జార్ఖండ్ డియోఘర్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ సింగ్ అనే పర్యాటకుడు ఇసుకతో అద్భుతంగా శివలింగాన్ని తీర్చిదిద్దాడు. అటుగా వచ్చిన పర్యాటకులను ఈ శివలింగం ఎంతగానో ఆకట్టుకుంది. పలువురు పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లో ఈ శివలింగాన్ని ఫొటో తీసుకున్నారు.

పార్కులు.. ప్రశాంతతకు నిలయాలు

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- రూ.2.50కోట్లతో స్వతంత్రనగర్ పార్కు నిర్మాణం


స్వతంత్రనగర్ పార్కులో మొక్క నాటి నీరు పోస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: పార్కులు.. ప్రశాంతతకు నిలయాలని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మధురవాడ స్వతంత్రనగర్‌లో రూ.2.50 కోట్లతో నిర్మించిన పార్కును శుక్రవారం ఆయన ప్రారంభించారు. పార్కులో క్రీడా, జిమ్ సామగ్రి, వాకింగ్ ట్రాక్, యోగా శాలను పరిశీలించి, మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ పార్కును నిర్లక్ష్యంగా వదిలేసిందన్నారు. మూడున్నర ఎకరాల్లోని ఈ పార్కును తమ ప్రభుత్వ హయాంలో రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. పార్కును సక్రమంగా నిర్వహించడంతో పాటు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు నగరంలో 780 పార్కులు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. తహసీల్దార్ హత్య ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, సమాజంలో విలువలు తగ్గిపోయి.. డబ్బే ప్రధానంగా మారిపోయిందన్నారు. అపార్ట్‌మెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, ఏఈ సురేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, సాంస్కృతిక విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ పేరుతో కేంద్రం మోసం

ఏఐసీసీ కార్యదర్శి ప్రణవ్ ఝా

తాటిచెట్లపాలెం: అగ్నిపథ్ పేరుతో కేంద్రం యువతను మోసం చేస్తోందని, ఈ పోటీల్లో ఒత్తిడిని తట్టుకోలేక సుమారు 50 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని ఏఐసీసీ కార్యదర్శి, కమ్యూనికేషన్ విభాగం ఇన్‌చార్జి ప్రణవ్ ఝా ఆరోపించారు. టీఎస్ఎన్ కాలనీలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అనేక చోట్ల అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించినా.. నేటికి అనేకమంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దేశంలో జరుగుతున్న అకృత్యాలను ప్రశ్నించేందుకు రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర చేస్తుంటే.. బీజేపీ శ్రేణులు అడ్డుకోవడం దారుణమన్నారు. మణిపూర్ అల్లర్లపై ప్రధాని కనీసం మాట్లాడడం లేదని.. లక్షలాది మంది నిరుద్యోగులకు మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామాన్యుల భవిష్యత్ కోసం కాంగ్రెస్ టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రవేశపెట్టిందని, సోషల్ మీడియా వేదికగా మోదీని ప్రశ్నించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో విజయదుందుభి మోగించిన కాంగ్రెస్.. ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికారం కైవసం చేసుకుంటుందన్నారు. ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు, పార్టీ శ్రేణులు తిలారి సురేష్, కాకినాడ చినబాబు, హైదర్ ఆలీ సింకా, గుర్రం కనకారావు, వాసుపల్లి దానయ్య, చెల్లుబోయిన నాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు


చెక్కు అందజేస్తున్న కోలా గురువులు

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా అందించే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని పలు డ్వాక్రా సంఘాల మహిళలకు డీసీసీబీ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను శుక్రవారం మద్దిపాలెం డీసీసీబీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో.. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా డీసీసీబీ ద్వారా ఇతోధికంగా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్‌లోనూ మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో రుణసాయం అందించనున్నట్లు తెలిపారు.

14 నుంచి గీతంలో అంతర్జాతీయ విద్యార్థి ఉత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ గుణశేఖరన్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు 'సంయుక్త-24' పేరిట అంతర్జాతీయ యువజన ఉత్సవం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అంతర్జాతీయ విద్యార్థుల సమక్షంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ అంతర్జాతీయన విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డా. కె.పి.కిషన్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.63,160
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,900
వెండి(కిలో):	రూ.76,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.132
స్కిన్	: రూ.234
స్కిన్‌లెస్	: రూ.244

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	559.00

పీవీకి భారతరత్న.. సర్వత్రా హర్షం


స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న నాటి ప్రధాని పి.వి.నరసింహారావు(ఫైల్)

ఉక్కునగరం: దివంగత మాజీ ప్రధాని, బహుముఖ కోవిదుడు పి.వి.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు పీవీ కర్మాగారం సందర్శనను తాజా గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 1971లో మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని 3.2 మిలియ టన్నుల సామర్థ్యంతో కూడిన ప్లాంట్ సిద్ధమై ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటికి ప్రధానిగా ఉన్న పి.వి.నరసింహారావు 1992 ఆగస్టు 1న ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి అక్కడి ఉత్పత్తి ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. తాజాగా పీవీకి భారతరత్న పురస్కారం ప్రకటించడంతో ఉక్కు అధికారులు, ఉద్యోగులు నాటి స్మృతులను గుర్తు చేసుకుని హర్షం వ్యక్తం చేశారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు


విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డీఈవో చంద్రకళ

సీతమ్మధార: పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం నులి పురుగుల నివారణ తప్పనిసరని డీఎం అండ్ హెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ హైస్కూల్‌లో విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ 400 ఎంజీ మాత్ర ఒకటి వేసుకుంటే నులి పురుగులు చనిపోతాయన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, గోళ్లు పెంచకుండా ఎప్పటికప్పుడు కట్ చేసుకోవాలని సూచించారు. జగనన్న గోరుముద్ద సంపూర్ణ పోషకాహారం అందరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ శాంతిప్రియ, ఆర్‌బీఎస్‌కే పీవో ఎ.కిరణ్‌కుమార్, రమణ, హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పోలవరం విధ్వంసానికి కారణమైన చంద్రబాబుపై చర్యలేవి?'

విశాఖ సిటీ: పోలవరం విధ్వంసానికి చంద్రబాబే కారణమని చెప్పిన కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏపీ సీనియర్ సిటిజన్స్ ఫోరం కన్వీనర్ కె.రామచంద్రమూర్తి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. పోలవరంను చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నాడని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానమిస్తూ.. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, ట్రాన్స్‌ట్రాయ్ వంటి కాంట్రాక్టర్ల వద్ద కోట్లు దండుకుని చంద్రబాబు ప్రభుత్వం తప్పిదాలు చేసిందని చెప్పారన్నారు. అయినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రూ.కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబును కేంద్రం కాపాడుతోందన్న అనుమానం ప్రజలకు కలుగుతోందన్నారు.